క్లుప్తంగా

పాఠశాల వరండా ధ్వంసం

గార: మండలంలోని చిన్నతూలుగు పాఠశాలలో వరండాను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వరండా పలకలను విరగ్గొట్టారు. దీంతో హెచ్ఎం హేమలత ఎంఈఓ సోమేశ్వరరావు, సచివాలయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులు సెలవులొస్తే పాఠశాలను పాడుచేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

పెదలింగాలవలసలో వైద్య శిబిరం



గ్రామస్తులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: మండలంలోని పెదలింగాలవలస పంచాయతీలో సోమవారం 104 వైద్య శిబిరం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయం ఏఎన్ఎం సుజాత, విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత గ్రామస్తులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేయూత మహిళా మార్ట్ ప్రారంభం



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: స్థానిక రైతుబజారులో శ్రీకాకుళం రూరల్ మండలానికి సంబంధించిన చేయూత మహిళా మార్ట్‌ను మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.22 లక్షల స్వయం సహాయక సంఘాల నిధులతో స్టోర్ ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, జెడ్పీటీసీ రుప్ప దివ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, పార్టీ నాయకులు చిట్టి రవికుమార్, పొన్నాడ రుషి, చల్లా అలివేలు మంగ తదితరులు పాలొంగన్నారు.

టాప్ యూజర్లకు ప్రశంసా పత్రాలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: టీం జగనన్న యాప్‌లో టాప్ యూజర్లుగా ఎంపికైన యువకులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎంపికైన వారిలో రణస్థలం మండలం జేఆర్ పురం గ్రామానికి చెందిన నడుపూరు యేసుపాదం, కొవ్వాడకు చెందిన మైలపల్లి సింహాచలం, లావేరు మండలం లింగాలవలసకు చెందిన వాళ్లె రమణ, జి.సిగడాం మండలం మెట్టవలసకు చెందిన సూరి సాయితేజ, టీడీవలసకు చెందిన టంకాల రామ్మోహన్‌రావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలు, ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు.

సేవలకు సత్కారం



వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ వలంటీర్లను మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ ఆధ్వర్యంలో సన్మానించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వీరిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఏర్నేన జ్యోతి శ్రీనివాస్, పశువైద్యాధికారి యు.సుమన్, సర్పంచ్ అల్లు జోగినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వాన వెంకటరమణ, కింజరాపు మల్లేశ్వరరావు, జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో పట్టాలు ఇవ్వలేదేం?

- ప్రతిపక్ష నేతలకు మంత్రి ధర్మాన సూటిప్రశ్న
- 150 మందికి పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: సెంటుభూమి దేనికీ సరిపోదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, అలాంటప్పుడు గత ప్రభుత్వ పాలనలో పేదలకు భూమి ఎందుకు ఇవ్వలేదని మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెదగనగళ్లవానిపేట, పెదపాడు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది పేదలకు సోమవారం పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ మండలంలో ఇప్పటివరకూ 12 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గం మొత్తంగా 20 వేలు పట్టాలు అందించామన్నారు. ఇందుకు గాను రూ.500 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఈ నాలుగేళ్లు సంక్షేమ ఫలాలను అందించామన్నారు. ప్రజాధనం వృధా చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, రాజ్యాంగంలో చెప్పిన దాని ప్రకారం అన్ని అవకాశాలు అందరికీ అందాలనే ఉద్దేశంతోనే ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి, తహశీల్దార్ వెంకటరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, పార్టీ నాయకులు చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, గురువులు, సూరడా సూర్యం, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన కొనసాగుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కొత్తపేట సచివాలయం పరిధిలోని ఎస్ఎంపురంపేటలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం ఆదర్శ పాలన సాగిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గతంలో జన్మభూమి కమిటీలు టీడీపీకి చెందిన వారికి మాత్రమే పథకాలు అందజేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుత పాలనలో పార్టీలకు అతీతంగా పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ బోర సరోజిని, ఎంపీటీసీ సభ్యులు సీరపు శ్రీరామ్మూర్తి, నాయకులు మూగి శ్రీరాములు, మెట్ట దాలినాయుడు, బోర గన్నయ్య, ఉప్పాడ హరిరెడ్డి, బచ్చు నర్సింగరెడ్డి, బచ్చు మల్లేషు రెడ్డి, దారపు అప్పన్న, దారపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం

- ఫౌంటెయిన్, వ్యాక్యూమ్ క్లీనర్ వెహికల్ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన



ఫౌంటెయిన్ ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



వాక్యూమ్‌క్లీనర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పరిసరాల పరిశుభ్రతతోనే మనిషికి ఆనందం, ఆరోగ్యం సాధ్యపడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ కూడలిలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్, రూ.58 లక్షలతో కొనుగోలు చేసిన వాక్యూమ్ క్లీనర్ వాహనాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారకముందే ఇంటి ముంగిటకు చెత్తసేకరణ చేసే క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాలు వీధుల్లో దర్శనమిస్తున్నాయన్నారు. గతంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిచ్చేవని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నగరమంతా పరిశుభ్రంగా ఉండటం వల్లే ప్రజలంతా దోమలు, పందులబెడదలేకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారన్నారు. స్వచ్ఛ శ్రీకాకుళం అన్నది మనందరి ధ్యేయం కావాలని, స్వచ్ఛందంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తేనే అది సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు, తూర్పుకాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్ సీపీ పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, చల్ల శ్రీనివాసరావు, అంధవరపు సంతోష్, ప్రసాద్, హారికా ప్రసాద్, మండవల్లి రవి, పసగాడ రామకృష్ణ, భైరి మురళి, తోటతారక్, వానపల్లి రమేష్, టంకాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను ఇన్‌స్పెక్టర్‌గా అఖిల్ ఎంపిక



అఖిల్

ఎచ్చెర్ల క్యాంపస్: పరీదుపేటకు చెందిన కొత్తకోట అఖిల్ ఆదాయపు పన్ను శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలో జాతీయ స్థాయిలో 2722 ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ కొలువు సాధించాడు. తండ్రి సుధాకర్ హైదరాబాద్‌లో పోలీస్ శాఖలో పనిచేస్తున్నారు. అఖిల్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీ కూడలి వద్ద సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిదాహార్తి నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. రిమ్స్ అన్నపూర్ణ సేవా కేంద్రం సౌజన్యంతోనూ పలు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆర్టీసీ కాంప్లెక్సులో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఉన్నత పాఠశాల హెచ్ఎం బసవ గొల్లబాబును అభినందించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ ఎస్.రమణమూర్తి, కో ఆర్డినేటర్లు కె.గణపతిరావు, పి.ఆనందరావు, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలో దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ /ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కంఠ వేణు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ బి.శాంతికి వినతిపత్రం అందజేశారు. గతంలో దళితుల కోసం కేటాయించిన స్థలంలో సచివాలయం నిర్మిస్తున్నారని, ఈ నేపథ్యంలో దళిత కుటుంబాలకు స్థలం కేటాయించి న్యాయం చేయాలని విన్నవించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



లావేరు: యోగా ఆవశ్యకతను వివరిస్తున్న రిసోర్సుపర్సన్ రామ్‌దేవ్



ఎచ్చెర్ల క్యాంపస్: కథల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: విద్యార్థులు ప్రతి రోజూ యోగా చేస్తే చదువులో బాగా రాణించవచ్చని రిసోర్సుపర్సన్ ప్రగడ రామ్‌దేవ్ అన్నారు. మురపాక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వేకువజామున ఐదు గంటలకే లేచి యోగా, వ్యాయామం చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో చిన్నారులకు సోమవారం కథల పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఆరో తరగతి విద్యార్థి జాన్‌కు ప్రథమ, జె.శ్రావ్యకు ద్వితీయ బహుమతి లభించింది. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.నీలమ్మ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: విద్యార్థులు చిత్రలేఖనంపైనా పట్టు సాధించాలని ఉపాధ్యాయుడు ధర్మవరపు కనకరాజు అన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు, సహాయకుడు బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: చిత్రలేఖనంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ధర్మవరపు కనకరాజు

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న సాయికుమార్, నాయకులు

లావేరు: మండలంలోని కేశవరాయునిపాలెం పంచాయతీ సర్పంచ్ యాగాటి వెంకటమ్మ మావయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు యాగాటి ఆదినారాయణ తండ్రి ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందారు. విషయం తెలియడంతో సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మురపాక సచివాలయ కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, నాయకులు అలుపున నారాయణరెడ్డి, పెయ్యల లక్ష్మణరావు, మహంతి సత్యనారాయణ, నాయని లక్ష్మణరెడ్డి, నారాయణ రెడ్డి, యాగాటి రమణమూర్తి తదితరులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

జి.సిగడాం: సంతవురిటిలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరావు సోదరుడు ఇటీవల మృతి చెందారు. ఈయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పార్టీ నాయకులు పెద్ది భాస్కరరావు, బత్తుల రాము, ఆబోతుల జగన్నాథం, సర్పంచులు వడిశ మహేశ్వరావు, చందనాల గణపతి తదితరులు పరామర్శించారు.

మహిళా సాధికారితకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్ : ప్రభుత్వం మహిళా సాధికారితకు కృషి చేస్తోందని, వారి ఖాతాలకే పథకాల నగదును జమ చేస్తోందని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. అరిణాం అక్కివలసలో సోమవారం పల్లె పల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నవరత్నాలు ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయని, ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. ఎన్నికలు ముందు ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, పథకాలు మంజూరు చేస్తుందని తెలిపారు. అరిణాం అక్కివలసలో రూ.2.12 కోట్ల మేర మహిళలకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, బెండు రామారావు, నక్క కృష్ణమూర్తి, సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అంబటి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యం లేక ఇక్కట్లు



అరసవల్లి ఆలయానికి వస్తున్న వాహనాలిలా..

అరసవల్లి:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు. ఇక్కడికి కార్లు, వ్యాన్లు, బస్సులతో వచ్చిన భక్తులకు సరైన పార్కింగ్ సౌకర్యం లేదు. ప్రధానంగా ఆదివారాల్లో భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్న నేపథ్యంలో స్థానికంగా ప్రైవేటు స్థలాల్లో కొంతమేరకు పార్కింగ్ ఫీజు చెల్లింపులు చేస్తున్నారు. అయినా స్థలాభావంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి చెందిన భూములు అరసవల్లి పరిసర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న నేపథ్యంలో ఆలయ నిర్వహణ సౌకర్యాల్లో భాగంగా పార్కింగ్‌కు అమలు చేస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాడాడ రోడ్డు, అరసవల్లి ఉద్యానవనతోట పరిసరాల్లో పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తే మంచిదని భక్తులు భావిస్తున్నారు.

‘విద్యుత్ వృథా చేయవద్దు’

అరసవల్లి: జిల్లాలో రోజువారీ డిమాండ్ మేరకు తగినంతగా విద్యుత్ సరఫరా అవుతోందని, అయితే వేసవిలో వినియోగం అధికంగా ఉండడంతో విద్యుత్‌ను వృథా చేయవద్దని ఎస్ఈ దైవప్రసాద్ విజ్ఞప్తి చేశారు. వినియోగదారులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అధిక లోడ్ వినియోగాలపై సిబ్బంది కూడా ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారన్నారు. అలాగే ఎప్పుడైనా విద్యుత్ సమస్యలు, అంతరాయం కలిగితే వెంటనే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే ప్రస్తుతం తీవ్ర గాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, వందల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించడంతో దాదాపుగా విద్యుత్ సరఫరాను అందజేయగలిగామన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది కూడా 24 గంటలూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించినట్లుగా వివరించారు. అలాగే జిల్లాలో ఇటీవల జరిగిన గాలుల తీవ్రతతో విద్యుత్ శాఖకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు.

రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జనావాసాల మధ్య ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో కార్యాలయాన్ని తహశీల్దార్ ఆఫీసు సమీపంలో సెనర్జీ స్కూల్ ఎదురుగా మార్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కల్యాణ వైభోగమే..!

- ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం
- హాజరైన మంత్రి ధర్మాన



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



స్వామిని దర్శించుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మండల కేంద్రం గారలో మూడు రోజులుగా జరుగుతున్న వేంకటేశ్వర ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి మూర్తులను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠింపజేశారు. పండితులు చామర్తి సత్యశ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం 10 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ వేడుకను తిలకించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లావేటిపేటలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేటిపేటలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధులు, కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారాలను తొలగించి డంపింగ్ యార్డులకు ట్రాక్టర్ల ద్వారా తరలించారు. అనంతరం క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.